క్లుప్తంగా

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం



ఇంద్రార్చితను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫలితాల్లో సత్తాచాటిన పట్టణ యువతి ఇంద్రార్చితను నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న ఇంద్రార్చిత ఇంటికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో పాటు ఆయా పార్టీల నాయకులు వెళ్లి శాలువాలు కప్పి సన్మానించారు. పట్టుదలతో చదివి సివిల్స్‌లో ర్యాంకు సాధించడంపై ఆమెను వారందరూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విశ్వం, బస్వం, కొంకళ్ల చెన్నయ్య, కొందూటి నరేందర్, ఎంఎస్ నట్‌రాజన్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు విష్ణువర్ధన్‌రెడి

కొత్తూరు: ప్రస్తుతం ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో గురువారం స్థానిక బీజేపీ నాయకుడు హరికృష్ణచారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాధ్యమైనంత వరకు ప్రజలు ఎండలో బయటకు రావొద్దన్నారు. తప్పనిసరిగా రావాల్సిన వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, శ్రీధర్‌చారి, కొండల్‌చారి, జనార్ధన్‌చారి, భైరమోని నర్సింహ, ఇంద్రసేనారెడ్డి, నరేందర్ రెడ్డి, మల్లేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అర్హుల సమాచారం పక్కాగా సేకరించాలి

ఎంపీడీఓ వెంకయ్య



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: సంక్షేమ పథకాలకు సంబంధించి నిజమైన అర్హులను గుర్తించి, వారి నుంచి పక్కా సమాచారం సేకరించాలని ఎంపీడీఓ వెంకయ్య సూచించారు. గురువారం శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పింఛన్లకు సంబంధించి మరణించిన వారి వివరాలు సేకరించి, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రాజీవ్ యువ వికాస్‌కి సంబంధించి గ్రామాల వారి జాబితా ఇప్పటికే అందించామని, వారిలో అర్హులను గుర్తించాలని కోరారు. ఎండాకాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు కృషిచేయాలి

ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి



సుందరపురంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి

కేశంపేట: గ్రామాల్లోని ప్రజలు ఇంటి పరిసరాలతో పాటు రోడ్లను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ రవిచంద్రకుమార్ రెడ్డి అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశాల్లో గ్రామ ప్రత్యేకాధికారులు పాల్గొని స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. మండల పరిధిలోని కోనాయపల్లి, కేశంపేట, సుందరపురం, కాకునూర్ గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలో ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. వేసవి కాలంలో నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. శానిటేషన్‌తో పాటు హైజానిక్‌పై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు స్పష్టం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీఓ కిష్టయ్య, నాయబ్ తహసీల్దార్ గీత, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇళ్ల రీ'సర్వే'

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల అర్హుల గుర్తింపు

- గ్రామాల్లో అధికారుల క్షేత్రపరిశీలన
- లబ్ధిదారుల ఎంపికకు పక్కా ప్రణాళిక
- మే 5 నుంచి అర్హుల ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన



బోధునంపల్లిలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంపై అధికారులు దృష్టి సారించారు. ప్రతీ మండలానికి ఒక్క గ్రామం చొప్పున పైలెట్ ప్రాజెక్టుగా ప్రకటించి ఇళ్లను మంజూరు చేశారు. పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో మొదటి దఫా బేస్‌మెంట్ లెవల్ పూర్తి చేసిన ఇళ్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో లక్ష రూపాయల బిల్లులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ప్రజాపాలనలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి ఇళ్లను అందించాలనే ఉద్దేశంతో మొదటి విడతగా గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నారు.

745 ఇళ్లు మంజూరు..

రాష్ట్ర ప్రభుత్వం మండలంలోని 29 గ్రామ పంచాయతీలకు మొదటి విడతలో 745 ఇళ్లు మంజూరు చేసింది. మండల పరిధిలోని అల్వాల (38), బైర్కాన్‌పల్లి (24), చింతకుంటపల్లి (27), బోధునంపల్లి (19), చింతకుంటపల్లి (27), దత్తాయపల్లి (06), దేవునిగుడితండా (25), ఎక్లాస్‌ఖాన్‌పేట (33), ఇప్పలపల్లి (15), కాకునూర్ (30), కేశంపేట (50), కొనాయపల్లి (20), కొత్తపేట (55), కొండారెడ్డిపల్లి (35), లేమామిడి (22), లింగంధన (23), మంగళిగూడ (30), నిర్దవెల్లి (41), పాపిరెడ్డిగూడ (36), పాటిగడ్డ (11), పాల్కొనిగుట్టతండా (12), పుట్టోనిగూడ (22), సంగెం (19), సంతాపూర్ (35), సుందరపూరం (12), తొమ్మిదిరేకుల (18), తూర్పుగడ్డతాండ(11), వేములనర్వ(50) ఇళ్లకు దరఖాస్తులు వచ్చాయి. వీటిలో నుంచి 745 మంది నిరుపేదలను గుర్తించి వారికి ఇళ్లను మంజూరు చేయనున్నారు. పైలెట్ ప్రాజెక్టుగా పోమాల్‌పల్లిలో ఇప్పటికే 36మంది లబ్ధిదారులను గుర్తించి ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.

గెజిటెడ్ అధికారులతో సర్వే

రాష్ట్ర ప్రభుత్వం అందించిన మొదటి విడత లిస్టును ఆధారంగా చేసుకొని జిల్లా అధికారులు మండలస్థాయి వెరిఫికేషన్‌కు గెజిటెడ్ అధికారులను నియమించింది. వీరు గ్రామాల్లో ఉన్న లిస్టు ఆధారంగా ఇంటింటికీ వెళ్లి ఇళ్లు ఎలా ఉంది.. కొత్తగా ఇంటి నిర్మాణానికి స్థలం ఉందా లేదా అనే వివరాలతో పాటుగా ఇళ్లు మంజూరు చేస్తే నిర్మించుకునేందుకు లబ్ధిదారులు సిద్ధంగా ఉన్నారా అనే విషయాలను తెలుసుకుంటున్నారు. ఈ సర్వేను అధికారులు ఈ నెల 30లోగా పూర్తి చేయాల్సి ఉంది. మండలంలో 814 మందితో కూడిన మొదటి విడత లిస్టులో 714 మందికి ఇళ్లు మంజూరైనట్టు అధికారులు తెలిపారు.

రోజువారీ కార్యక్రమాలు

ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు గెజిటెడ్ అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన. మే 1న ఎంపీడీఓ లాగిన్‌కు మెరిట్ లిస్ట్, మే 2న మెరిట్ లిస్టు గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద బహిర్గతంగా ఉంచడం. మే 3, 4వ తేదీల్లో మెరిట్ లిస్టు ఆన్‌లైన్ పోర్టల్‌లో వెరిఫికేషన్.

మే 5 నుంచి నిర్మాణాలు

గెజిటెడ్ అధికారులు గ్రామాల్లో నిర్వహించిన సర్వేలో అర్హులను గుర్తించి నివేదికలను జిల్లా అధికారులకు అందిస్తారు. మే 1 నుంచి 4వ తేదీ వరకు వెరిఫికేషన్‌తో పాటు ఆన్‌లైన్ పూర్తయిన వెంటనే మే 5 నుంచి హౌసింగ్ అధికారులతో కలిసి గ్రామాల్లో ప్రభుత్వం సూచించిన కొలతల మేరకు ఇంటి నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు.

సర్వే కొనసాగుతోంది



మండలంలోని 28 గ్రామాల్లో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నలుగురు గెజిటెడ్ అధికారులతో సర్వే కొనసాగుతోంది. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోగా సర్వేను పూర్తిచేసి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తాం. సర్వేలో అర్హులైన వారిని మాత్రమే గుర్తిస్తున్నాం.

– రవిచంద్రకుమార్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ

అర్హులందరికీ ఇళ్లు అందిస్తాం



ప్రస్తుతం గ్రామాల్లో మొదటి విడత ఇళ్లను అందించేందుకు సర్వే కొనసాగుతోంది. నిరుపేదలైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం ఇళ్లను అందించేందుకు సిద్ధంగా ఉంది. త్వరలోనే ఇందిరమ్మ కాలనీలను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. మండలానికి 800ల వరకు ఇళ్లను మంజూరు చేశాం. నెల రోజుల్లోగా మరో వేయి ఇళ్లను మంజూరు చేస్తాం. ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇళ్లు అందిస్తాం.

– వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్



సర్వేలో పాల్గొన్న ఎంపీడీఓ బన్సీలాల్, గెజిటెడ్ అధికారులు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఎంపీడీఓ బన్సీలాల్

షాద్‌నగర్: ప్రభుత్వం అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని ఎంపీడీఓ బన్సీలాల్ అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు ఆరుగురు గెజిటెడ్ అధికారులను నియమించారన్నారు. ఈ నెల 30 వరకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వానికి నివేదికను అందిస్తామని తెలిపారు. లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో గెజిటెడ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ రైతుల ప్రభుత్వం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం క్వింటాల్ వరి ధాన్యానికి రూ.2320లు గిట్టుబాటు ధరతో పాటు అదనంగా రూ.500లు బోనస్ ఇస్తుందన్నారు. రైతు కష్టానికి ప్రభుత్వం ప్రతిఫలం అందజేస్తుందని, రైతులు దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని సూచించారు. రైతులు యాసంగి సీజన్‌లో పండించిన పంటలను చివరి గింజ వరకు కొనుగోలు చేసి సకాలంలో డబ్బులు చెల్లిస్తుందన్నారు. అనంతరం కొందుర్గులో నూతనంగా నిర్మించనున్న మార్కెట్ స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సింగిల్ విండో సీఈఓ మహిమూద్, నాయకులు రామయ్యగౌడ్, పురుషోత్తంరెడ్డి, ఇబ్రహీం, కావలి యాదయ్య, రోహిత్‌రెడ్డి, చంద్రశేఖర్, మల్లేశ్‌గౌడ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీఓ విజయలక్ష్మి

ఎంపీఓ విజయలక్ష్మి

కొత్తూరు: గ్రామ పంచాయతీల పరిధిలో ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చే సమస్యలను పంచాయతీ కార్యదర్శులు సకాలంలో పరిష్కరించాలని ఎంపీఓ విజయలక్ష్మి సూచించారు. గురువారం ఆమె గూడూరులో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆమె మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించినట్లు తెలిపారు. అంతేకాకుండా సభలో ప్రజలు వివిధ సమస్యలను తమ దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అనంతరం ఆరోగ్యం, శుభ్రత, తదితర అంశాలపై వైద్య, సిబ్బంది, అధికారులు, ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు



అంతారంలో పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ స్రవంతి

షాబాద్: పశువులకు సీజన్‌లగా వచ్చే వ్యాధులపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని రేగడిదోస్వాడ, షాబాద్ పశువైద్యాధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, స్రవంతి సూచించారు. గురువారం మండల పరిధిలోని అంతారం, సంకెపల్లిగూడ, బోనగిరిపల్లి గ్రామాల్లో పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో పశువులకు మే 13 వరకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నట్లు, పశుకాపరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బలరాం, అంజయ్య, మహేందర్, రాణి, శ్రీకాంత్, సాయి, శేఖర్ తదితరులు ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

సీఐ విజయ్‌కుమార్



యోగ తరగతులను ప్రారంభిస్తున్న సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్: ప్రతిరోజు యోగ సాధన చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పట్టణ సీఐ విజయ్‌కుమార్ అన్నారు. పట్టణ సమీపంలోని సాయిబాలాజీ టౌన్‌షిప్ పార్కులో పతంజలి యోగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పానుగంటి శశిధర్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత యోగ శిక్షణ తరగతులను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ప్రతిరోజు యోగ సాధన చేయాలని సూచించారు. యోగాతో మానసికోల్లాసం కలగడంతో పాటు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందన్నారు. యోగాసనాలతో ఒత్తిడిని తగ్గించంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఉదయం 5 గంటల నుంచి 6:30 గంటల వరకు నిర్వహించే ఈ ఉచిత యోగ శిక్షణ తరగతులను పరిసర కాలనీల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యోగ గురువులు రాజేశ్వర్, జోత్స్న, కాలనీవాసులు రాఘవేందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు ముఖ్యమే

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి

నందిగామ: విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మామిడిపల్లిలో 12 రోజులుగా నిర్వహించిన ఎంపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్సీ ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న క్రీడాపోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విన్నర్ టీమ్‌కు రూ.30వేల నగదుతో పాటు ట్రోఫీ అందజేశారు. అదేవిధంగా రన్నర్‌గా నిలిచిన టీమ్‌కు రూ.20వేల నగదుతో పాటు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యురాలు మాధవిరవీందర్, మాజీ ఉపసర్పంచ్‌లు సత్యనారాయణ, హన్మంత్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ యాదగిరిరెడ్డి, నాయకులు రఘుపతిరెడ్డి, వెంకటేశ్, దామోదర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, కృష్ణయ్య, పురోషోత్తంరెడ్డి, అశ్రఫ్, శ్రీనివాస్, శ్రీకాంత్, మధు, రాజు, జగన్, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు

పర్యాటకులపై ఉగ్రదాడి పిరికిపంద చర్య

బీజేపీ మండల అధ్యక్షుడు మద్దూరు మాణెయ్య



మొయినాబాద్‌లో ఉగ్రవాద దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

షాబాద్: ఉగ్రవాదులు నూటికి నూరుశాతం పిరికి పందలేనని బీజేపీ మండల అధ్యక్షుడు మద్దూరు మాణెయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తమ్మలి రవీందర్ అన్నారు. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని గురువారం తీవ్రంగా ఖండించారు. మతాలను ప్రామాణికంగా తీసుకొని హత్యలు చేయడం దుర్మార్గమన్నారు. ఉగ్రవాదులు చనిపోతే మానవత్వం పేరుతో విమర్శలు చేసే కొందరి నోర్లు ఇప్పుడు ఎందుకు మెదపడం లేదని మండిపడ్డారు. దాడులకు తప్పకుండా ఉగ్రవాదులు మూల్యం చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు కుమ్మరి చెన్నయ్య, నాయకులు కిరణ్, నర్సింలు, రాము, గౌరీ, తౌఫీక్, ముఖ్రంఖాన్, లింగంగౌడ్, శ్రీనివాస్, గౌతం, ఉపాధ్యాయులు నర్సింలు, లక్ష్మణ్, బందయ్య, యువకులు తదితరులు ఉన్నారు.

హిందూ సంఘాల ఆధ్వర్యంలో..

మొయినాబాద్: కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ గురువారం మొయినాబాద్‌లో హిందూ సంఘాల ఆధ్వర్యంలో పాకిస్థాన్ ఉగ్రవాద దిష్టిబొమ్మను దహనం చేశారు. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు షాపురం శ్రీకాంత్, మహేశ్, పాండు, శ్రీనివాస్, బిందు కిరణ్, సాయి, వికాస్, వినోద్ పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడికి నిరసనగా ర్యాలీ

షాద్‌నగర్: కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ గురువారం పట్టణంలో హిందు ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ దేవాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ పార్థసారథికి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ ర్యాలీకి బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలతో పాటుగా బార్ అసోసియేషన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు, బీసీ సేన నాయకులు మద్దతు తెలిపారు. పట్టణ చౌరస్తాలో ఉగ్రవాదులకు సంబంధించిన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందె బాబయ్య, చెట్ల వెంకటేశ్, మఠం రాచయ్య, నాగిళ్ల ప్రభాకర్, రమేశ్, డాక్టర్ చందులాల్, కిరణ్‌కుమార్, న్యాయవాది వేణుగోపాల్ రావు, హరిభూషణ్, శివకుమార్ పాల్గొన్నారు.



షాబాద్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు, ఉపాధ్యాయులు

కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ

చేవెళ్ల: పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా మండలంలోని కమ్మెట, ఆలూరు గ్రామాల్లో గురువారం రాత్రి యువకులు, నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారందరూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతిచేకూరాలని వేడుకున్నారు. కార్యక్రమంలో కమ్మెట మాజీ సర్పంచ్ హన్మంత్‌రెడ్డి, గ్రామ యువకులు, నాయకులు శశిధర్‌గౌడ్, అంజన్, ఆలూరు గ్రామ నాయకులు రాఘవేందర్, శ్రీశైలం, నర్సింలు, గ్రామ యువకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె.రామస్వామి

మొయినాబాద్‌రూరల్: కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.రామస్వామి అన్నారు. గురువారం మండల పరిధిలోని తోల్‌కట్ట గ్రామంలో సీపీఐ గ్రామ అధ్యక్షుడు వెంకటయ్య అధ్యక్షతన పార్టీ మహాసభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా రామస్వామి పాల్గొని మాట్లాడుతూ.. టెరరిస్టులపై పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 27 మంది అమాయక ప్రజలు ఉగ్రదాడికి బలైపోవడం బాధాకరమన్నారు. దాడులకు తప్పకుండా ఉగ్రవాదులు మూల్యం చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, మొయినాబాద్ మండల సీపీఐ కార్యదర్శి కె.శ్రీనివాస్, వెంకటయ్య, మల్లేశ్, పాండు, జలీల్, రాజు, వెంకటయ్య, బుచ్చయ్య, శంకర్, గోపాల్, రాములు పాల్గొన్నారు.